క్లుప్తంగా

ఎస్‌ఐకు సన్మానం


పెద్దయ్యనాయుడును సన్మానిస్తున్న దృశ్యం

హొళగుంద: స్థానిక ఎస్‌ఐ పెద్దయ్యనాయుడు, ఏఎస్‌ఐ శ్రీనివాసులును గ్రామానికి చెందిన నూర్‌బాషా దూదేకుల సంఘం నాయకులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఇటీవల జరిగిన మొహర్రం నిర్వహణకు అనుమతినివ్వడంతో పాటు ప్రశాంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నందుకు వారికి కృతజ్ఞతలు తెలిపి శాలువాతో సన్మానించారు. హుసేన్ పీరా, మౌలాలి, సాయిబేష్, పీరా, బాబన్న, మాబు పాల్గొన్నారు.

టమాట మార్కెట్ వేలం


బిణిగేరిలో టమాట మార్కెట్ వేలం నిర్వహిస్తున్న దృశ్యం

ఆస్పరి: బిణిగేరి గ్రామంలో టమాట మార్కెట్‌కు సోమవారం వేలం నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ వెంకటేష్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి నాగమణి ఏడాదికి సంబంధించి టమాట మార్కెట్‌కు వేలం నిర్వహించారు. ఇందులో ఐదుగురు పాటదారులు పాల్గొన్నారు. చిన్నహోతూరు ఈరన్న రూ.5లక్షలకు పాడి దక్కించుకున్నారు. కాగా..గత ఏడాది రూ.4.10లక్షలు పలకగా ఈసారి రూ.5లక్షలు పలకడంతో పంచాయతీకి రూ. 90వేలు ఆదాయం లభించింది. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

‘మధ్యాహ్నం’లో నాణ్యత లోపిస్తే చర్యలు


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ ఈరన్న

హాలహర్వి: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని ఎంఈఓ ఈరన్న హెచ్చరించారు. సోమవారం స్థానిక ఎంపీపీఎస్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. వంట ఏజెన్సీ నిర్వాహకులు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు స్నాక్స్ కింద అలసంద గుగ్గిళ్లు అందజేశారు.

పుస్తకాలు, బ్యాగుల పంపిణీ

హొళగుంద: స్థానిక జూనియర్ కళాశాలలో 2024–25కు సంబంధించి కళాశాలలోని 268 మంది విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు స్టడీ కిట్‌ను ప్రిన్సిపాల్ ప్రవీణ సోమవారం అందజేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు స్టడీ కిట్‌ను సద్వినియోగం చేసుకొని బాగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. అధ్యాపకులు శశికుమార్, మల్లికార్జున, రమేష్, నరసింహులు, సిబ్బంది వాసు పాల్గొన్నారు.

ఈరన్నస్వామికి పూజలు


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో స్వామి క్షేత్రం సందడిగా మారింది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. ఆలయంలో కొందరు భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.

డమ్మీ అకౌంట్లలో నష్టపరిహారం జమ


సబ్‌కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న పెద్దహరివాణం గ్రామ రైతులు

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో పంట నష్టపరిహారం రైతుల ఖాతాల్లో కాకుండా డమ్మీ అకౌంట్లలో జమ అయ్యాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ఆదోనిలోని సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని ధర్నా చేపట్టారు. సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మకు వినతి పత్రం అందజేశారు. రైతులు మాట్లాడుతూ 25 మందికి వేరే ఖాతాల్లో జమ చేయగా, 630 మందికి సంబంధించిన పరిహారం రైతుల కాని వారి ఖాతాల్లో జమ చేశారని ఆరోపించారు. విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు.

రాష్ట్రంలో అరాచక పాలన

- మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



తుగ్గలి(పత్తికొండ) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో జరుగుతున్న హత్యలు, దాడులు, విధ్వంసాలు చూస్తే మొత్తంగా ఒక ఆటవిక, అరాచక పాలన సాగుతోందని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి విమర్శించారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. చంద్రబాబు అధికారం చేపట్టినప్పటి నుంచి ఆ పార్టీ శ్రేణులు రాష్ట్రంలో దాడులు, దౌర్జన్యాలు చేస్తూ విధ్వంసం సృష్టిస్తూ నీచ సంస్కృతికి తెరలేపారన్నారు. అభివృద్ధి చేయమని ప్రజలు అవకాశం ఇస్తే విధ్వంసం సృష్టిస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చి హామీలు అమలు చేయకుండా కుంటి సాకులు వెతుకుతున్నారని మండిపడ్డారు. పూర్తిస్థాయిలో బడ్జెట్ ప్రవేశపెట్టక పోవడంలో అంతర్యమేంటో చంద్రబాబు ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. బడ్జెట్ పెట్టకుండా మరో మూడు నెలలు ఓటాన్ అకౌంట్‌కు ఎందుకు వెళ్లారో స్పష్టత ఇవ్వాలన్నారు. బడ్జెట్‌లో ఏయే పథకాలకు ఎంత కేటాయిస్తున్నారో చెప్పాల్సి వస్తుందనే కొత్త నాటకాలు ఆడి బడ్జెట్ ప్రవేశపెట్టడం లేదన్నారు. రాష్ట్రం రావణకాష్టంలా మండుతుంటే అనుకూల మీడియా, ఉపముఖ్యమంత్రి పవన్‌కు కనిపించడం లేదా ప్రశ్నించారు. ఎన్నికల ముందు చంద్రబాబు, అతని అనుకూల మీడియా ఈ రాష్ట్రానికి ఉన్న అప్పులు రూ.14 లక్షల కోట్లు అంటూ ఊదరగొట్టారని..గవర్నర్ ప్రసంగానికి వచ్చేసరికి రూ.10లక్షల కోట్లకు తగ్గించారన్నారు. 2019 మే 30న జగన్ అధికారం చేపట్టే నాటికి రాష్ట్ర ఖజానా కేవలం రూ.100 కోట్లు మాత్రమేనని గుర్తు చేశారు. అయినా పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టి ఐదేళ్లలో పేదల ఖాతాల్లో రూ.2.71 కోట్లు డీబీటీ ద్వారా జమ చేశారని వివరించారు. 2019లో మాదిరి కష్టాలను ఈ ప్రభుత్వానికి తాము ఇవ్వలేదన్నారు. మోసపూరిత హామీలను అమలు చేయలేని పరిస్థితిలో ప్రజలు ఎక్కడ ప్రశ్నిస్తారోనన్న భయం చంద్రబాబును వెంటాడుతోందన్నారు. అందుకే హామీలపై ప్రజలు ప్రశ్నించకుండా రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని నడుపుతూ బాబు, లోకేష్ ఆదేశాల మేరకు దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. జగన్ సీఎంగా ఉండిఉంటే ఇప్పటికే రైతులకు రైతు భరోసా, అమ్మ ఒడి అందేదని ప్రజలు అనుకుంటున్నారని చెప్పారు. వలంటీర్లకు రూ.10వేలు ఇస్తామని నమ్మించి మోసం చేశారని, అసలు వలంటీర్ వ్యవస్థ ఉంటుందో లేదో కూడా స్పష్టతనివ్వడం లేదన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి బైక్‌లకు నిప్పు

- పూర్తిగా కాలిపోయిన ద్విచక్ర వాహనాలు
- బొమ్మిరెడ్డిపల్లెలో ఘటన, ఉద్రిక్తత
- టీడీపీ శ్రేణులపై అనుమానం


సూర్యనారాయణ చౌదరికి చెందిన రెండు బైక్‌లకు నిప్పు పెట్టిన దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): మండలంలోని బొమ్మిరెడ్డిపల్లె వైఎస్సార్‌సీపీ నాయకుడు సూర్యనారాయణ చౌదరికి చెందిన రెండు మోటార్ బైక్‌లను సోమవారం గుర్తుతెలియని వారు నిప్పు పెట్టారు. దీంతో రెండు మోటారు సైకిళ్లు కాలి బూడిదయ్యాయి. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. సూర్యనారాయణ చౌదరి కుటుంబం కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. అప్పుడప్పుడు గ్రామానికి వచ్చి తమ ఇంట్లో నివాసముంటూ, కౌలుకిచ్చిన తమ పొలం పనులు, పండుగలు తదితర కార్యక్రమాలు చూసుకునేవారు. వారికి చెందిన బైక్‌లు సైతం ఇంటి ఆవరణలో ఉంచారు. ఇటీవల గ్రామంలో గిరినాథ్ చౌదరి హత్య జరిగిన అనంతరం వైరి వర్గం పలువురు గ్రామం వదిలి వెళ్లిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సూర్యనారాయణ చౌదరికి చెందిన పొలాలను కౌలుకు తీసుకునేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో తమ పొలాలు చూసుకునేందుకు కుమారులతో కలిసి గ్రామానికి వచ్చారు. పొలాలను చూసుకుని ఇంటి వద్దకు రావడంతో హత్యకు గురైన గిరినాథ్ చౌదరి, బంధువుల కుటుంబీకులు, దాయాదులైన టీడీపీ శ్రేణులు వారితో వాగ్వాదానికి దిగారు. పికెటింగ్ పోలీసుల సమాచారం అందుకున్న వెల్దుర్తి పోలీసులు గ్రామానికి చేరుకుని సూర్యనారాయణ చౌదరి కుటుంబీకులకు నచ్చజెప్పి గ్రామం నుంచి పంపించారు. ఈ క్రమంలో వారు ఊరు వదిలి కర్నూలు వెళ్లిన అనంతరం వారి ఇంటి ఆవరణలో ఉంచిన యమహా, ప్యాషన్ ప్రో బైక్‌లకు నిప్పంటించారన్న సమాచారం అందుకుని తిరిగి వచ్చారు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో సీఐ మధుసూదన్ రావు, ఎస్‌ఐ సునీల్ కుమార్ గ్రామానికి చేరుకుని విచారించారు. తమకు న్యాయం చేయాలని, బైక్‌లకు నిప్పుపెట్టిన వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ, టీడీపీ శ్రేణులపై అనుమానాలు వ్యక్తం చేస్తూ సూర్యనారాయణ చౌదరి పోలీసులను ఆశ్రయించారు. కేసు విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కంది పంటకు వేరుకుళ్లు తెగుళ్లు


కంది పంటను పరిశీలిస్తున్న ఏఓ రవి


వేరుకుళ్లు సోకిన కంది పైరు

మద్దికెర : కంది పంటను వేరుకుళ్లు తెగుళ్లు ఆశించి నాశనం చేస్తుందని వెంటనే తగిన మందులు పిచికారీ చేసి పైరును కాపాడుకోవాలని ఏఓ రవి తెలిపారు. సోమవారం మండలంలోని ఎడవలి గ్రామంలో సాగు చేసిన కంది పంటను పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ ఆకులపై పసుపు రంగు మచ్చలు ఏర్పడి నెమ్మదిగా పూర్తిగా పసుపు రంగులోకి మారి మొక్కలోని కాండం కుళ్లి పోయి పూర్తిగా వాడిపోయి చనిపోతుందన్నారు. నివారణకు లీటర్ నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ (బ్లైటాక్స్), ప్లాంటో మైసిన్ 0.2 గ్రాములు కలిపి మొక్కల కాండం తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు.

ఒకటో తేదీనే పింఛన్ల పంపిణీ

తుగ్గలి : సామాజిక పింఛన్‌దారులకు ఆగస్టు 1వ తేదీనే పింఛన్లు అందజేయాలని జిల్లా ఉన్నతాధికారులు ఎంపీడీఓలకు ఆదేశాలు జారీ చేశారు. నియోజకవర్గంలో పత్తికొండ మండలంలో 8,175, తుగ్గలిలో 7,341, వెల్దుర్తిలో 7,560, కృష్ణగిరిలో 4,677, మద్దికెర మండలంలో 4,564 పింఛన్ దారులు ఉన్నారని, తొలిరోజు 6గంటలకు పింఛన్ పంపిణీని ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశించారు. మిగిలిన వారికి రెండవరోజు ఇవ్వాలని సూచించారు.

నూతన చట్టాలపై అవగాహన

మద్దికెర : ప్రతి ఒక్కరికీ నూతన చట్టాలపై అవగాహన ఉండాలని ఎస్‌ఐ రమేష్‌బాబు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మహిళలపై దాడులు చేయడం, దూషించడం వంటి వాటికి పాల్పడితే శిక్షార్హులవుతారన్నారు. చట్టాల్లో మార్పులు చేశారని వాటి గురించి తెలుసుకొని నడుచుకోవాలని చెప్పారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

దేవనకొండ: ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి యెహోషువా డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఈశ్వరయ్యకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ జీవోనంబర్ 117ను రద్దు చేసి జీవో ఎంఎస్ నంబర్ 55 ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించాలని కోరారు. ఒకటి నుంచి ఐదు తరగతులు ఒకే పాఠశాలలో నిర్వహించాలన్నారు. యూటీఎఫ్ మండలాధ్యక్షుడు లక్ష్మణ్, మద్దిలేటి, మధు పాల్గొన్నారు.

పేదలకు అల్పాహారం పంపిణీ

వెల్దుర్తి(కృష్ణగిరి): పేదలకు సేవ చేయడంలోనే ఆత్మ సంతృప్తి ఉంటుందని హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షుడు హరి నరసింహనాయుడు తెలిపారు. సోమవారం సొసైటీ ఆధ్వర్యంలో వెల్దుర్తిలోని పేదలు, అభాగ్యులకు అల్పాహారం అందజేశారు. ఆయన మాట్లాడుతూ తమ సంస్థలను విస్తరిస్తామని చెప్పారు. సభ్యులు ఈశ్వరయ్య, అంజి పాల్గొన్నారు.

నేడు మండల మీట్

హాలహర్వి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే విరూపాక్షి ముఖ్య అతిథిగా హాజరవుతారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామిరెడ్డి సోమవారం తెలిపారు. సమావేశానికి పార్టీ మద్దతుదారులైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు.

పశువుల షెడ్లకు దరఖాస్తు చేసుకోండి

కృష్ణగిరి: పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పాడి రైతులకు సబ్సిడీపై పశువుల షెడ్ల నిర్మాణానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కృష్ణగిరి పశు వైద్యాధికారి నవీన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రైతులకు మినీ గోకులాలను ప్రభుత్వం నిర్మిస్తుందన్నారు. రెండు పశువుల యూనిట్ విలువ రూ.1,01,500 కాగా, రైతు వాటాగా 10శాతం అంటే రూ.11,500 చెల్లించాల్సి ఉంటుందన్నారు. నాలుగు పశువులకు రూ.1,85,000 కాగా సబ్సిడీ పోనూ రైతు వాటా కింద రూ.18,500 చెల్లించాలి. ఆరు పశువులకు రూ.2,30,000 అయితే సబ్సిడీ పోనూ రైతు వాటా కింద రూ.23వేలు చెల్లించాలన్నారు. అలాగే గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్ నిర్మాణాలకు కూడా సబ్సిడీ లభిస్తుందన్నారు. అర్హులైన రైతులు మండలంలోని కృష్ణగిరి, కంబాలపాడు, కటారుకొండ పశువైద్య కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఆయా గ్రామాల పరిధిలోని పశు వైద్యులను సంప్రదించాలని కోరారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

దేవనకొండ: ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ హాస్టళ్ల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.శరత్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని తెర్నేకల్ గ్రామ బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు, కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలన్నారు. జిల్లాలో శిథిలావస్థకు చేరిన భవనాల్లో వసతి గృహాలు నిర్వహిస్తున్నారని, నూతన భవనాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే తెర్నేకల్ వసతి గృహంలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడంతో గదులు సరిపోవడంలేదని, విద్యార్థులు ఆరుబయట నిద్రిస్తున్నారన్నారు. వసతి గృహానికి ప్రహరీ లేకపోవడంతో సర్పాలు, తేళ్లు వంటివి వస్తున్నాయన్నారు. సంఘం మండలాధ్యక్షుడు మధు, నాయకులు ఉమేష్, సురేంద్ర, శివ, రమేష్ పాల్గొన్నారు.

గొంతులు ఎండుతున్నా పట్టించుకోరా?

- ప్రధాన రహదారిపై ప్రజల ధర్నా
- మద్దతుగా ప్రజాసంఘాల నాయకులు


బళ్లారి చౌరస్తాలో ధర్నా చేస్తున్న మహిళలు

ఆలూరు: గుక్కెడు నీటి కోసం 20 రోజుల పాటు ఎదుచూస్తున్నామని, ఎండుతున్న మా గొంతులు తడపాల్సిన బాధ్యత పాలకులకు లేదా అని ప్రశ్నిస్తూ పట్టణంలోని వివిధ కాలనీలకు చెందిన మహిళలు సోమవారం ధర్నా చేశారు. ఎన్జీవోస్, సిద్దేశ్వర కాలనీ, ఉరుకుంద ఈరన్న కొట్టాల కాలనీకి చెందిన మహిళలు బళ్లారి చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వీరికి సీపీఐ, ఏఐటీయూ, హమాలీ యూనియన్ నాయకులు గోపాల్, ఈరన్న, చిన్న, పులి తదితరులు మద్దతు ప్రకటించారు. ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ తుంగభద్ర నీటిని దిగువకు వదులుతున్నారని, అయినా మాకు ఇక్కడ చుక్కనీరు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గం నుంచి లక్షలాది క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తున్నా ఇక్కడ తాము మాత్రం చుక్కనీటికి నోచుకోకపోతున్నామని మండిపడ్డారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి ప్రకాష్ నాయుడికి వినతి పత్రం అందజేయగా.. ఆయన మాట్లాడుతూ తమ చేతుల్లో ఏమీ లేదని చెప్పడంతో ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఫిజియోథెరపీతో దివ్యాంగుల్లో శారీరక అభివృద్ధి


విద్యార్థికి ఫిజియోథెరపీ చేస్తున్న సోమశేఖర్

ఆలూరు రూరల్: ఫిజియోథెరపీతో దివ్యాంగులు శారీరకంగా అభివృద్ధి చెందుతారని మండల ఎంఈఓ కోమలా దేవి అన్నారు. సోమవారం ఆలూరు భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ క్యాంప్‌ను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లలకు శారీరక లోపం, మస్తిష్క పక్షవాతం, మానసిక వైకల్యం ఉన్న వారికి ఫిజియోథెరపీ అవసరమన్నారు. భవిత కేంద్రంలో చేయించే వ్యాయమాలు దివ్యాంగుల తల్లిదండ్రుల ఇంటి దగ్గర రోజు ఉదయం, సాయంత్రం చేయిస్తే ఫలితం ఉంటుందన్నారు. ప్రైవేటుగా ఫిజియోథెరపీ చేయించాలంటే ఒకసారికి రూ.400 వరకు ఖర్చు అవుతుందని, భవిత కేంద్రంలో ఉచితంగా చేస్తున్నామని పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫిజియోథెరపిస్టు సోమశేఖర్, తల్లి దండ్రులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్‌ను పునఃప్రారంభించండి


తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

హొళగుంద: మండల కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న ఎస్సీ బాలుర హాస్టల్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని హాస్టల్‌ను పునఃప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పెద్యాట శ్రీరంగ, మండల కార్యదర్శి సతీష్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దారు ప్రసాద్‌రాజును కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రూ.88 లక్షలతో నిర్మించిన ఎస్సీ హాస్టల్‌ను ఆరేళ్ల క్రితం మూసి వేశారని దీనివల్ల చాలా మంది విద్యార్థులు విద్యకు దూరమై తల్లిదండ్రులతో కలిసి పనుల కోసం వలస వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో పేద విద్యార్థులు అధికంగా ఉన్నారని, గతంలో హాస్టల్ ఉండడంతో వారి చదువుకు ఇబ్బందులు ఉండేవి కాదన్నారు. వెంటనే హాస్టల్‌ను తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

అధ్వానంగా తొగలుగల్లు రోడ్డు


తొగలుగల్లు రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

ఆస్పరి: మండలంలోని యాటకల్లు నుంచి తొగలుగల్లుకు వెళ్లే 3కి.మీ.రోడ్డు అధ్వానంగా మారింది. మోకాళ్లోతు గుంతలు పడటంతో వాహనదారులు, పొలాలకు ఎద్దుల బండ్లపై వెళ్లే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తొగలుగల్లు నుంచి యాటకల్లు మీదుగా మండల కేంద్రమైన ఆస్పరికి రావాలంటే అవస్థలు పడాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో గుంతల్లో వర్షపు నీరు నిలిచి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారుతందని చెబుతున్నారు. ఆ సమయంలో ఆస్పరికి రావాలంటే తురువగల్లు, తంగడరడోణ మీదుగా 30 కి.మీ. చుట్టూ తిరిగి రావాల్సి ఉంటుందన్నారు. అదే యాటకల్లు మీదుగా ఆస్పరికి రావాలంటే 10 కి.మీ. దూరం ఉంటుందన్నారు. ఇప్పటికైనా పంచాయితీరాజ్ అధికారులు యాటకల్లు నుంచి తొగలుగల్లుకు వరకు అప్రోచ్ రోడ్డు వేయించి ఇబ్బందులు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎన్‌సీసీ కేడెట్స్ ఎంపిక

ఆదోని సెంట్రల్: పట్టణంలోని పురపాలక మైదానంలో వన్ ఆంధ్ర మెడికల్ కంపెనీ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులను ఎన్‌సీసీకి ఎంపిక చేశారు. ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ మేజర్ వైవీసీకే రెడ్డి సమక్షంలో జరిగిన ఎంపికలో నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాల నుంచి 8వ తరగతి చదువుతున్న 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. శారీరక, ఆరోగ్య పరీక్షలను నిర్వహించి 120 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి మాట్లాడుతూ ఎన్‌సీసీ శిక్షణ ద్వారా దేశం పట్ల భక్తి, గౌరవం పెరుగుతాయన్నారు. ఎన్‌సీసీ సర్టిఫికెట్ల ద్వారా వివిధ స్థాయిలో రిజర్వేషన్లు ఉపయోగించుకొని ఉన్నత స్థాయికి చేరుకోవడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఎన్‌సీసీ అధికారులు అనిల్ కుమార్, ఉరుకుందప్ప, సిబ్బంది రాజేష్ కుమార్, రాజేంద్ర సింగ్, వంశీ పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి కృషి


నాగప్పయాదవ్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తుగ్గలి : ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఇన్‌చార్జ్ ఎంపీపీ అద్దంకి ఎర్ర నాగప్పయాదవ్ అన్నారు. గత ఎంపీపీ అనుంరాజు అదెమ్మ వ్యక్తిగత కారణాలతో ఈ ఏడాది మార్చిలో తన పదవికి రాజీనామా చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలవడే వరకు ఇన్‌చార్జ్ ఎంపీపీగా ఎర్ర నాగప్పను కొనసాగించాలని జిల్లా ఉన్నత అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రెండు రోజుల క్రితం నాగప్ప బాధ్యతలు స్వీకరించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని ఎంపీపీ ఛాంబర్‌లో నాగప్పను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇన్‌చార్జ్ ఎంపీపీ పదవి ఎంపికకు సహకరించిన పార్టీ నాయకులకు, ఎంపీటీసీ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు పులికొండనాయక్, వైస్ ఎంపీపీ మల్లికార్జునరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు చాంద్‌బాషా, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నాగేష్, నాయకులు రామచంద్రారెడ్డి, జగన్నాథరెడ్డి, మోహన్ రెడ్డి, నాగభూషణరెడ్డి, గోపాల్‌రెడ్డి, హనుమంతు, సుధాకర రెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, మధు, అమరనాథరెడ్డి, సోమశేఖరరెడ్డి, రఘు, హనుమంతరెడ్డి, సుంకన్న, పక్కీరప్ప పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి


సమస్యలు వింటున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోని రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం – పీజీఆర్ఎస్‌లో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆయన స్వీకరించారు. మండంలోని ఆయాశాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎసెల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారి ఆర్.శేషయ్య, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, ఆర్అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్ మహమ్మద్‌రఫీ, ఆర్టీఓ నాగేంద్ర, గృహ నిర్మాణశాఖ డిప్యూటీ ఇంజనీర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆయా మండలాల నుంచి వచ్చిన సమస్యల్లో కొన్ని...

- పొలాలకు పిల్ల కాలువలు ద్వారా నీటిని అందిస్తే వరినాట్లు వేయడానికి వీలు ఉంటుందని, దయతో పిల్ల కాలువలు ద్వారా సాగునీరు అందజేయాలని, కౌతాళం గ్రామ రైతులు అర్జీ సమర్పించుకున్నారు.
- ఆదోని పట్టణం ప్రకాష్‌నగర్‌కు చెందిన మీనాక్షికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, పెద్ద కుమార్తె 9వ తరగతి చదువుతోంది, రెండో కుమార్తె 8వ తరగతి చదువుతుందని, ప్రస్తుతం తమ కుమార్తెలకు సాంఘిక వసతిగృహంలో అడ్మిషన్ కోసం అర్జీ సమర్పించారు.
- ఆదోని మండలంలోని పెద్దతుంబళం గ్రామానికి చెందిన వెంకటేష్‌కి సంబంధించి సర్వేనంబర్ 412లో 7 ఎకరాలు, 413/2లో 1.63 ఎకరాలు, 256/2ఏ నందు 0.97 ఎకరాలు, 256/2సీలో 2.31 ఎకరాలు మొత్తం 11.91 ఎకరాల భూమి పెద్దల నుంచి సంక్రమించిందని, సదరు భూమి ఆన్‌లైన్‌లో వేరే వారి పేరు నమోదయ్యిందని, విచారణ చేసి ఆన్‌లైన్‌లో తమ పేరు నమోదు చేయాలని అర్జీ సమర్పించారు.
- ఆదోని మండలం జాలిమంచి గ్రామానికి చెందిన చిన్నభీమయ్యకు సంబంధించి సర్వేనంబర్ 36/2 మరియు 36/3లో 2.50 ఎకరాల భూమి ఉండగా అందులో 1.60 ఎకరాలను అమ్మడం జరిగిందని, మిగిలిన 90 సెంట్ల భూమి ప్రభుత్వ భూమిగా చూపిస్తుందన్నారు. సదరు భూమిని విచారణ చేసి న్యాయం చేయాలని అర్జీ సమర్పించుకున్నారు.

‘తిథి భోజన్’తో ముగిసిన శిక్షా సప్తాహ్


పగిడిరాయి జెడ్పీ హెచ్ఎస్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఉపాధ్యాయులు

వెల్దుర్తి(కృష్ణగిరి): జాతీయ విద్యా విధానం అమలులోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 22 నుంచి ప్రారంభించిన శిక్షాసప్తాహ్ (విద్యా వారోత్సవాలు) కార్యక్రమాలు సోమవారం నాటి ‘తిథి భోజన్, శుభ్ భోజన్’ కార్యక్రమంతో ముగిశాయి. మండలంలోని రామళ్లకోట ఎంపీపీ స్కూల్‌లో హెచ్ఎం కృష్ణయ్య ఆధ్వర్యంలో ఆఖరి రోజు ‘తిథి భోజన్’ కార్యక్రమంలో తహసీల్దార్ అనంతాచారి, ఎంఈఓ–1 ఇందిర, ఎంఈఓ–2 రమేశ్ పాల్గొన్నారు. దాతలు రామకృష్ణాచారి, వెంకట రమణ అందించిన పండ్లు, స్వీట్లను విద్యార్థులకు అందజేసి, నైపుణ్యాలు ప్రదర్శించిన విద్యార్థులను అభినందించారు. బోయనపల్లె హైస్కూల్‌లో హెచ్ఎం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ పెద్దలు కాంతారెడ్డి, శ్రీనివాసరెడ్డి, జనార్దన్ శెట్టి, నాగభూషణ్ తదితరులు పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

తుగ్గలి : వారం రోజులుగా పాఠశాలల్లో ‘శిక్షా సప్తాహ్’ పేరుతో నిర్వహిస్తున్న వారోత్సవాలు సోమవారం ముగిశాయి. బోధన సామగ్రి ప్రదర్శన, పునాది అభ్యసన, క్రీడా దినోత్సవం, సాంస్కృతిక దినోత్సవం, సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం, పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. చివరి రోజు పగిడిరాయి జెడ్పీ హెచ్ఎస్‌లో జియో మైసూర్ గోల్డ్ మైనింగ్ కంపెనీ ప్రతినిధులు, తుగ్గలి మెయిన్ స్కూల్‌లో పత్తికొండకు చెందిన కూరగాయల వ్యాపారి తిమ్మారెడ్డి విద్యార్థులకు తీపి వంటకాలతో భోజనం అందించారు. అలాగే ఆయా పాఠశాలలో దాతలు అందించిన భోజనాన్ని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

మద్దికెర : శిక్షాసప్తాహ్ కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని ఎంఈఓ రంగస్వామి అన్నారు. సోమవారం ముగింపు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు స్వశక్తితో ఏర్పాటు చేసిన వస్తువులు ప్రదర్శించడం, ఆటల్లో ప్రావీణ్యత సాధించడం వంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ముగింపు కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు మద్దికెరలో అంజనేయులు, పెరవలి గ్రామంలో రవికుమార్ భోజనాలు ఏర్పాటు చేయడంపై అభినందించారు.

హొళగుంద: మండలంలోని ఆయా ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో సోమవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా తిథి శుభదిన్ కార్యక్రమం పేరిట మధ్యాహ్న భోజనానికి బదులుగా విద్యార్థులకు స్వీటు, అరటి పండ్లు ఇతర భోజనాలను అందించారు. ఎంఈఓ–1 సత్యనారాయణ, ఎంఈఓ–2 జగన్నాథం, హెచ్ఎంలు, గ్రామపెద్దల ఆధ్వర్యంలో దాతల సహకారంతో విద్యార్థులకు మంచి భోజనాన్ని అందించారు.